తటాకాన్ని తలపిస్తున్న రైల్వే ఖాళీస్థలం

- 50రోజులుగా కదలని వరద నీరు
- దోమలతో అల్లాడుతున్న కాలనీవాసులు


60వ డివిజన్‌లోని వాంబే కాలనీ రైల్వే ఖాళీస్థలంలో నిలిచి ఉన్న వరద నీరు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్, వాంబే కాలనీ మధ్యనున్న రైల్వేశాఖకు చెందిన పదెకరాల ఖాళీస్థలం వరదనీటితో తటాకాన్ని తలపిస్తోంది. వరదలకు ఈఖాళీస్థలంలో చేరిన నీరు ఎటూవెళ్లే వీలులేక 50రోజులుగా అక్కడే నిలిచిపోయింది. ఈ స్థలం చుట్టూ నాలుగు వైపులా రైల్వేవారు ప్రహరీ నిర్మించగా, బుడమేరు వరదలకు ఓవైపు గోడ కొంతమేర కూలిపోయింది.

పరిసరాలు దుర్గంధం..

వరదనీరు నెలన్నరకుపైగా అక్కడ నిలిచిఉండటంతోపాటు చెత్తచెదారం కారణంగా పరిసరాలు దుర్గంధం వెలువడుతోంది. ఈస్థలానికి నాలుగు వైపులా ఆపార్ట్‌మెంట్‌లు, నివాసగృహాలు ఉన్నాయి. వాంబే కాలనీ ఏ, డీ, జీ, ఎఫ్, హెచ్ బ్లాక్‌ల్లో పేదలు నివసిస్తున్నారు. నిల్వ ఉన్న నీటికారణంగా వెదజల్లే దుర్వాసనను స్థానికులు భరించలేకపోతున్నారు. కొబ్బరిబోండాలు పాడైపోయిన టైర్లు, చెత్తాచెదారం కుళ్లిపోవడంతో నీరు రంగు మారిపోయి ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన కారణంగా ఈ రైల్వే ఖాళీస్థలం ప్రాంతానికి రాగానే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి. సుమారు 50రోజులుగా వరదనీరు నిల్వ ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని వాంబే కాలనీ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు వాపోతున్నారు.

వ్యాధుల విజృంభనతో బెంబేలు..

ఖాళీ స్థలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వ్యాప్తిచెందుతున్నాయి. దీంతో వాంబే కాలనీ ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ రైల్వే ఖాళీస్థలంలోని వరదనీటిని బయటికి పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాంబేకాలనీవాసులు కోరుతున్నారు. రైల్వేశాఖ అధికారులు ఈస్థలాన్ని మెరక చేయించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాసన భరించలేకపోతున్నాం..



వరద నీరు నిలిచి ఉన్నా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. సాయంత్రం అయితే దోమలు ఉధృతిని తట్టుకోలేకపోతున్నాం. పరిసరాలన్నీ దుర్వాసన వస్తుండటంతో రోడ్డున వెళ్లే పరిస్థితి లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఇస్మాయిల్, వాంబే కాలనీ

మురుగునీటిని తొలగించాలి...



ఖాళీ స్థలంలో వరద నీరు చేరి 50రోజులవుతోంది. చెత్తాచెదారం నీటిలో కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు ఉధృతి పెరిగడంతో కాలనీల్లో ఉండలేని పరిస్థితి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే మోటార్లతో ఈ నీటిని బయటకు పంపించాలి.

– దుర్గారావు, అజిత్‌సింగ్‌నగర్

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కృష్ణా నదికి ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉందని, నగరంలోని నదీ పరీవాహిక ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని శనివారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో సూచించారు.

వాతావరణ శాఖ హెచ్చరికలతో నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ఈఈ రివర్ కన్జర్వేటర్ కృష్ణ సెంట్రల్ డివిజన్ సమాచారం మేరకు ప్రకాశం బ్యారేజ్ లో ప్రస్తుతం నీటిమట్టం 57,500 క్యూసెక్కులు ఉండగా, పులిచింతల ప్రాజెక్టు డ్యాం నీటిమట్టం లక్ష క్యూసెక్కులకు పెరిగిందని, ప్రకాశం బ్యారేజ్ నీటిమట్టం కూడా ఆదివారం లక్ష క్యూసెక్కులకు పెరిగే అవకాశాలు ఉందని పేర్కొన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వరద హెచ్చరికలతో వీఎంసీలో 24/7 పనిచేసేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వీఎంసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంకు నిరంతరం ప్రజలు ఫిర్యాదులను అందజేయవచ్చని సూచించారు.

క్లుప్తంగా

గ్రంథాలయానికి హ్యాండ్‌మైక్ వితరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి దాతలు హ్యాండ్‌మైక్‌ను బహుకరించారు. గ్రంథాలయంలో ప్రస్తుతం ఉన్న మైక్ సరిగా పని చేయడం లేదని గ్రంథాలయాధికారి కె.రమాదేవి తెలుపగా, దాతలు వి.నాగరాజు, కృష్ణవేణి దంపతులు స్పందించి వారి తనయుడు మాధవ్ సత్యసాయి జ్ఞాపకార్థం గ్రంథాలయానికి రూ.5వేల విలువ చేసే హ్యాండ్‌మైక్‌ను బహుకరించారు. దాతలకు గ్రంథాలయాధికారి రమాదేవి కృతజ్ఞతలు తెలియజేశారు.

చురుగ్గా సాగుతున్న పైపులైన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నుంచి దేవీనగర్ వైపు వెళ్లే యూజీడీ పైపులైన్ కనెక్టివిటీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల బుడమేరు వరదల కారణంగా పాడైన పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశారు. దేవీనగర్‌లోని సంపును శనివారం శుభ్రం చేసి యూజీడీ పైపులైన్లకు కనెక్షన్లు ఇచ్చారచు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సింధూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వాహనచోదకులు పూజలు చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయకార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ



పాయకాపురం(విజయవాడరూరల్): ఎల్‌బీ ఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌కు మీ సేవా సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు యుగంధర్, కంప్యూటర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మైనం హుస్సేన్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల్లో హైస్కూల్‌లోని కంప్యూటర్ మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. దీంతో మీసేవ సంస్థ సభ్యులు స్పందించి కంప్యూటర్ అందచేశారంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అలరించిన సంగీతవిభావరి



విజయవాడ కల్చరల్: మధుర స్వరాలశాల ఘంటసాల అని మహానటి సావిత్రి సాహిత్య సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి కొనియాడారు. సావిత్రి సంక్షేమ సంఘం ,రాగలహరి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో అమర గాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం గాత్రస్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన సభ్యులు చావా నరసింహారావు. ప్రభలశ్రీనివాస్. పైడిపాటి వెంకన్న, కే దేవిడ్‌రాజు చలపతిరావు, కొప్పుల ఆనంద్ ప్రసంగించారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, అయ్యప్పన్, శ్రీనివాసరావు,గుడిపాటి హరికృష్ణ, విష్ణుప్రియ ఆలపించిన తెలుగు, హిందీ చిత్ర గీతాలు అందరినీ అలరించాయి. నిర్వాహకులు గాయని మల్లాది స్వాతిని ఆత్మీయంగా సత్కరించారు.

22నుంచి చెస్ టోర్నీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు భారతీయ నవీన క్రీడాఉత్సవ్ పేరిట ఫిడే రేటింగ్ చెస్ ఫెస్టివల్–2024 చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ ఎస్‌కే ఖాసీం, స్కూల్ డైరెక్టర్ రాజేంద్ర తెలిపారు. ఈ పోటీల బ్రోచర్‌ను సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు దేశాల 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. చెస్ పోటీల విజేతలకు రూ. 15లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఎస్‌కేయూ ఫౌండేషన్ సభ్యులు వి. కుమార్, నరేష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన


తోమాసా కరోరా, జోవన్నాలతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సైన్స్ విద్యార్థులకు మెడికల్ కోడింగ్, వివిధ ప్రోగ్రాంలు, కామర్స్ విద్యార్థులకు బ్యాంకింగ్, జీవన నైపుణ్యాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటలీకు చెందిన కేర్ టు అక్షన్ చైర్మన్ తొమాసో కరోరా, జోవన్నా ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మెడికల్ కోడింగ్, బ్యాంకింగ్, జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ప్రతీ విద్యార్థి కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, మాట్లాడుతూ కేర్ టు అక్షన్ చొరవతో విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం తోమాసా కరోరా, జోవన్నాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోజలిండ్, డి.బాలసుబ్రమణ్యం, సుధాకర్, విజయదీప్, యుగంధర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు

జిమ్నాస్టిక్ పోటీల్లో విజయవాడ క్రీడాకారుల సత్తా


జిమ్నాస్టిక్ రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఈనెల 17, 18వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. వీపీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శ్రీసరయు అండర్–12 యునివన్ బార్స్ విభాగంలో మొదటి, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో ద్వితీయ, బాలెన్సింగ్ బీమ్‌లో ద్వితీయ బహుమతి, ఎల్.శ్రీరామ్ అండర్–14 హైబార్ విభాగంలో తృతీయ బహుమతిని సాధించారు. సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎస్.కీర్తన జూనియర్ బాలికల ఫ్లోర్ విభాగంలో మొదటి, యునివన్ బార్ విభాగంలో ద్వితీయ, బాలెన్సింగ్ విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించగా, పీబీ సిద్ధార్థ కాలేజీ విద్యార్థిని ఎస్.ఐశ్వర్య సీనియర్ మహిళల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో తృతీయ, టేబుల్ వాల్ట్ విభాగంలో తృతీయ బాలెన్సింగ్ బీమ్ విభాగంలో ద్వితీయ బహుమతిని గెలుపొందారు. వీఆర్ సిద్ధార్థ కాలేజీ విద్యార్థి ఎస్.ప్రజ్ఞ బాలెన్సింగ్ బీమ్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఉమ్మడి కృష్ణాజిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు డి.నాగమల్లేశ్వరరావు, బి.బాబురావు, కోశాధికారి ఎల్.మురళీకృష్ణ, వీపీఎస్ పబ్లిక్ స్కూల్ పిన్సిపాల్ సీతారామయ్య, కోచ్ వై.రామ్మోహన్ శనివారం అభినందించారు.

సాక్షి మ్యాథ్స్ బీకి విశేష స్పందన


మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేషస్పందన లభించింది. మొత్తం నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన పరీక్షలకు ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు 55మంది విద్యార్థులు హాజరయ్యారు. గణితంలో పట్టు సాధించేందుకు ఈ పరీక్షలు తమకు ఎంతో ఉపయోగంగా ఉందని, ఇప్పటివరకు మ్యాథ్స్‌పై తమకు ఉన్న భయం పోయిందంటూ విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు. స్పెల్ బీ, మ్యాథ్స్ బీ వంటి పరీక్షల ద్వారా ఆయా సబెక్ట్‌లపై మరింత ఆసక్తి పెరిగిందని వారు తెలిపారు.

సబ్జెక్టులపై ఆసక్తి పెరిగింది..



స్పెల్ బీ, మాథ్స్ బీ పరీక్షల ద్వారా ఆయా సబ్జెక్టులపై మాకు ఆసక్తి మరింత పెరిగింది. ఈ పరీక్షల స్పెల్ బీ ద్వారా కొత్త పదాలు, వాటి ఉచ్చరణ, అర్థాలు తెలుసుకుంటున్నాం. లెక్కల్లో సులభమైన పద్ధతులపై అవగాహన వచ్చింది.

–ఎం.అర్చన, తొమ్మిదో తరగతి

ఆలోచన శక్తి పెరుగుతుంది..



మాథ్స్ బీ పరీక్షల ద్వారా మాథ్స్ సబ్జెక్టుపై ఆసక్తి పెరిగింది. సులువైన మార్గాలలో లెక్కలు ఏవిధంగా చేయాలో నేర్చుకుంటున్నాను. ఈ పరీక్షలకు హాజరైనందున స్కూల్‌లో చురుగ్గా మాథ్స్ చేయగలననే నమ్మకం కలిగింది,

–గితేష్, ఐదోతరగతి

మా ప్రతిభను తెలుసుకుంటున్నాం..



భవిష్యత్పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు 'సాక్షి' నిర్వహిస్తున్న ఈ పరీక్షలు పాఠ్యంశాలతోపాటు పోటీపరీక్షలపై కూడా ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఇటువంటి పరిక్షలు రాయటం ద్వారా మాలోని ప్రతిభను మేము తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

– పి.విజిత్‌కుమార్, ఎనిమిదోతరగతి

23న పాతశివాలయంలో కానుకల లెక్కింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో ఈ నెల 23న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. బుధవారం ఉదయం పది గంటల నుంచి లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మధురానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పి.రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ మెయిన్ రోడ్, లెక్చరర్ కాలనీ, ఇందిరా కాలనీ, రైల్వే సొసైటి కాలనీ, రాగం మస్తాన్ రోడ్డు, జాన్ టీ స్టాల్ నుంచి రామాలయం వరకు, మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డు, సాయిబాబా కాలని 1,2,3,4, 5 వ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి ఐస్టా ర్యాంకింగ్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: బెజవాడ శ్రీకృష్ణారెడ్డి, అఖిల భారత సీనియర్ టెన్నిస్ అసోసియేషన్(ఐస్టా) ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఈనెల 21వ తేదీ నుంచి విజయవాడ ఇందిరాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాధాకృష్ణమూర్తి తెలిపారు. 25వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి దేశవ్యాప్తంగా 270మంది క్రీడాకారుల ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వివరించారు. 35ఏళ్లపైబడిన 45, 55, 65, 70ఏళ్ల వయస్సు పైబడిన విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయని వివరించారు. 21 నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభమవుతాయని తెలిపారు. టోర్నమెంట్ డైరక్టర్‌గా ఎం.మల్లికార్జునరావు వ్యవహరిస్తున్నారు.

క్యాన్సర్ అవగాహన మాసోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నలభై ఏళ్ల వయస్సు దాటిన మహిళలు ఏడాదిలో రెండు సార్లు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ కె.పి. రంగనాథ్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసోత్సవాలలో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రొమ్ము క్యాన్సర్ మహిళల్లోనే కాకుండా, పురుషులలో కూడా వస్తుందని తెలిపాలరు. ఛాతీలో గడ్డ కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

ప్రైవేట్ స్థలాల్లోనే బాణసంచా విక్రయాలు!

వీఎంసీ అధికారులపై కూటమి నేతల ఒత్తిడి

పటమట(విజయవాడతూర్పు): ప్రైవేట్ స్థలాల్లోనే బాణసంచా విక్రయాలు చేయాలని వీఎంసీ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో వీఎంసీకి పదుల సంఖ్యలో ఖాళీ స్థలాలున్నాయి. ఏటా వీటిలో బాణసంచా స్టాల్స్ ఏర్పాటుచేసేవారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేవారు. ఇక్కడ ధర కూడా తక్కువగా ఉంటుంది. భద్రతా చర్యలు ఉండేవి. అదే కూటమి నేతలు చెప్పినట్లు ప్రైవేట్ స్థలాల్లో విక్రయాలు జరిపితే అద్దె అధికంగా ఉంటుంది. ప్రభుత్వ అజమాయిషీ లేక భద్రతా ప్రమాణాలు తక్కువగా ఉంటాయి. ఈ ఏడాది స్టాల్స్ ఏర్పాటు ఆలస్యమవుతుండటంపై వ్యాపారులు వీఎంసీపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే కూటమి నేతలు ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటుచేయాలని అల్టిమేటం ఇవ్వడంతో అధికారులు స్పందించడం లేదు. అయితే బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటుచేయకపోతే వీఎంసీ ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది.

హోంగార్డుల ఐక్యత అభినందనీయం

జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు


దుర్గాభవాని, కొండమ్మకు చెక్కులను అందజేసిన సీపీ రాజశేఖరబాబు


విజయవాడస్పోర్ట్స్: మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించేందుకు తోటి హోంగార్డులు ఐక్యతతో ముందుకు రావడం అభినందనీయమని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. సిటీ హోంగార్డ్ యూనిట్‌లో పనిచేస్తున్న బడుగు నాగరాజు, మోతుకూరి వీరరాఘవయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులంతా వారి ఒకరోజు రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ నగదు చెక్కులకు కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ రాజశేఖరబాబు బాధిత కుటుంబాలకు శనివారం పంపిణీ చేశారు. నాగరాజు భార్య దుర్గాభవానికి రూ.5లక్షల చెక్కును, వీరరాఘవయ్య భార్య కొండమ్మకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ కె.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న బబిత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): బుడమేరు వరదల కారణంగా చాలామంది బాధితులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయని వరద ప్రభావిత ప్రాంత ప్రజలంతా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ ఎం.బబిత సూచించారు. ఆంధ్రా న్యాయ సేవాధికార సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ముందుగా సెకండ్ అడిషనల్ డిస్టిక్ జడ్జి సత్యానంద్, జిల్లా వైద్యాధికారిణి సుహాసిని, నార్త్‌జోన్ ఏసీపీ కె.స్రవంతిరాయ్‌లతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బుడమేరు వరదల కారణంగా విజయవాడ నగర ప్రజలు ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా దెబ్బతిన్నారన్నారు. నిరుపేదలు అధికంగా జీవిస్తున్న వాంబేకాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. తీవ్ర అనారోగ్య సమస్యలకు కూడా ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నామని వివరించారు. ప్రజలు ఎవరైతే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారో అటువంటి వారికి ఉచిత న్యాయ సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక న్యాయవాదిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం కారణంగా చిన్నపిల్లలు చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని, చిన్నారుల కదలికలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సింగ్‌నగర్ సీఐ డీహెచ్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆలయ అక్రమ నిర్మాణం పరిశీలన


వీవీ నరసరాజు రోడ్డులో వెలిసిందంటూ ప్రచారం చేస్తున్న విగ్రహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాల పేరిట మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో అక్రమంగా నిర్మించిన ఆలయాన్ని శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. దసరా ఉత్సవాల పేరిట పరదాల చాటున ఆలయం పేరిట విలువైన స్థలం కబ్జా చేస్తున్న విషయాన్ని శనివారం సాక్షి 'ఆక్రమణల తొలగింపునకు చర్యలేవీ' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాంబాబు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఇరిగేషన్ సిబ్బందితో కలిసి ఆలయాన్ని తొలగించేందుకు జేసీబీతో వచ్చారు. అయితే ఆలయాన్ని ఏ విధంగా తొలగిస్తారంటూ నిర్వాహకులు అడ్డుకున్నారు. తమకు రెండు రోజుల సమయం కావాలని తామే తొలగిస్తామంటూ అధికారులకు నచ్చచెప్పారు. తమ ఆలయం జోలికి రావాలంటే ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం నుంచి కాలువ ఒడ్డున ఉన్న ఆక్రమణలు అన్నింటినీ తొలగించాలని అప్పుడే తాము తొలగిస్తామంటూ తేల్చి చెప్పారు. ఇప్పటికే దసరా ఉత్సవాల సమయంలో ఆలయ నిర్మాణాన్ని అడ్డుకున్నప్పుడు కూడా తమకు సమయం కావాలని తామే తొలగిస్తామంటూ చెప్పడంతోపాటు లెటర్ రాసిచ్చిన నిర్వాహకులు ఇప్పుడు కూడా అదే పాట పాడటం గమనార్హం. అధికారులు తూతూమంత్రంగా చుట్టూ ఉన్న పరదాలు తొలగించి వెళ్లిపోయారు. ఇక్కడ ఆలయాన్ని తొలగించేందుకు వీలులేదంటూ రాజకీయ ఒత్తిడి వస్తున్నట్టు తెలిసింది.

మరో ఆక్రమణకు రంగం సిద్ధం

ఇప్పటికే వీవీ నరసరాజు రోడ్డులో శ్రీకృష్ణ మందిరం పేరిట ఆక్రమణ చేయగా ఇప్పుడు దసరా ఉత్సవాల్లో మరో ఆలయం పేరిట కబ్జా చేశారు. తాజాగా ఇదే రోడ్డులో కాలువ పక్కన అమ్మవారి విగ్రహం వెలిసిందని వెంటనే ఆలయం నిర్మించాలంటూ ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ ఇటీవల రోడ్డు నిర్మించారు. అలాగే లోతుగా ఉన్న ప్రాంతంలో మట్టిని సైతం పోశారు. అటువంటి ప్రాంతంలో అమ్మవారి విగ్రహం వెలిసిందంటూ ఆక్రమణలకు తెర లేపుతున్నారు.